## క్లుప్తంగా

### సర్వసభ్య సమావేశం వాయిదా

కన్నాయిగూడెం: కోరం లేకపోవడంతో సర్వ సభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఫణీచంద్ర తెలిపారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం నిర్వహించావల్సి ఉండగా ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదా వేశామన్నారు.

### సమావేశాలకు తరలిన కార్మికులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ ఆర్టీసీ రోడ్డులోని సీఐటీయూ ఆఫీసులో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు జిల్లా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మోత్కూరి కోటి ఆధ్వర్యంలో ఆర్టిజన్ కార్మికులు సోమవారం తరలివెళ్లారు. నాయకులు కోటి, కొసరి భాస్కర్ ఉన్నారు.

### నియామకం



మహదేవపూర్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షుడిగా పోలు మొండయ్యను నియమించారు. ఈ మేరకు మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు సోమవారం అభినందించాడు.

### కరాటేతో ఆత్మరక్షణ



ఏటూరునాగారం: కరాటేతో ఆత్మరక్షణ కలుగుతుందని కరాటే మాస్టర్ అబ్బు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు కరాటే శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటేలో ఉన్న కాటస్, మనల్నీ మనం ఎలా రక్షించుకోవాలి, ఏదైనా ప్రమాదం ఎదురైనప్పుడు వెంటనే మనం సెల్ఫ్‌డిఫెన్స్ చేయాలన్నారు. శత్రువులు ఎదురైనప్పుడు ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో తప్పించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా కరాటే శిక్షణ నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు విజ్ఞానం, చురుకుదనం ఏర్పడుతుందన్నారు.

### విద్యుదాఘాతంతో కూలీ మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చిట్యాల: విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని గుంటూరుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుపల్లికి చెందిన కొంక శ్రీనివాస్‌రావు (55) వ్యవసాయ శనివారం వ్యవసాయ కూలీ పనికి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామస్తుల, బంధువుల ఇళ్లలో వెతికారు. అచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతడి కుటుంబ సభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారు. కాగా, వ్యవసాయ బావుల కుటుంబ సభ్యులు వెతుకుతూ.. అనుమానం వచ్చి ఓ రైతును నిలదీయడంతో అసలు విషయం బయటకు వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. అదే గ్రామానికి రైతులు పంట చేనులోకి అటవీ పందులు రాకుండా పంట చేను చుట్టూ విద్యుత్ తీగలను పెట్టడంతో తీగలకు తగిలి షాక్ గురై శ్రీనివాస్‌రావు అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆ రైతులు మృతదేహాన్ని పడేసిన స్థలాన్ని చూపినట్లు తెలిపారు. మృతిడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతిడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

కాళేశ్వరం: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై జె.లక్ష్మణ్‌రావు అన్నారు. మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధిలోని కుంట్లం గ్రామంలో ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామస్తులతో మమేకమై ఎసై మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట టీఎస్ఎస్పీ, సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

# ‘తొలిమెట్టు’తో నూతన ఒరవడి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్న



హాజరైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఏటూరునాగారం: తొలిమెట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నూతన ఒరవడిని సృష్టించనుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు కమ్యూనిటీ ప్రోగ్రాంను, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై చిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో విద్యార్థులకు చదవడం, రాయడం వంటి విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించేందుకు వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సామాజిక కార్యక్రమాల లక్ష్యమే ధ్యేయంగా విద్యార్థులు దృష్టి పెట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పురోగతి కమ్యూనిటీ డెవలప్మెంట్ చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ వర్క్ షాప్ లో దాదాపు 80 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ కు తమకు నచ్చిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రతి శనివారం సందర్శించి సూపర్ 15 మంది పిల్లల్లో వివిధ రకాల నైపుణ్యాలు, సృజనాత్మకత విషయాలపై అభివృద్ధి చేస్తారని తెలిపారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఘన్ సింగ్, రమేష్ కుమార్, డాక్టర్ స్వామి, డాక్టర్ రేణుక, సీహెచ్ వెంకటయ్య, డాక్టర్ నవీన్, ఫాతిమా, జ్యోతి పాల్గొన్నారు.

# వీరేశం సేవలు మరువలేనివి



నినాదాలు చేస్తున్న సీతక్క, తుడుందెబ్బ నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి కోర్నిబెల్లి వీరేశం సేవలు మరువలేనివని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి అన్నారు. మండలం కేంద్రం సమీపంలోని కామారంలో రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి ఆధ్వర్యంలో సోమవారం కోర్నిబెల్లి వీరేశం స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సీతక్క హాజరై స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. తుడుందెబ్బ ఉద్యమంలో చేసిన పోరాట వీరేశం స్ఫూర్తిని స్మరిస్తూ తుడుందెబ్బ నాయకులు, ఎమ్మెల్యే సీతక్క రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్మారక సంతాప సభలో పలువురు తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ.. కోర్నిబెల్లి వీరేశం సంఘంలో అనేక ఉద్యమ కార్యక్రమాలు చేపట్టి ఆదివాసీలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. తుడుందెబ్బ సంఘం నిస్వార్థంగా ఆదివాసీ సమాజం హక్కుల అమలు కోసం కృషి చేసిన మంచి మానవతావాది అని, ఎన్నో అవకాశాలు కలిసి వచ్చిన వాటిని తిరస్కరించి, ఆదివాసీ ప్రజా పోరాటమనే మార్గమని పరితపించే వ్యక్తి వీరేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు రేగ నరేంద్రకుమార్, పొడెం బాబు, ఆరేం లచ్చుపటేల్, కోర్నిబెల్లి గణేష్, సర్పంచులు రేగ కల్యాణి, ఇర్ప సునీల్, జిల్లా నాయకులు పాయం కోటేశ్వర్‌రావు, హన్మంతరావు, లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మైపతి సంతోష్, కోర్నిబెల్లి రాఘవరావు, చందా రఘుపతి, లక్ష్మణ్‌రావు, నారాయణ, బాబురావు, కొప్పుల జగన్, సమ్మయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరావు

గణపురం: ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోదరులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారయణ రెడ్డి, గండ్ర సాయిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారయణ చెల్పూరులో కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ పానుగంటి సుధర్మమల్‌హాల్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మొగులోజు రవీందర్, మాజీ ఎంపీటీసీ తిరుపతి గౌడ్‌తో పాటు దాదాపు 500 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

### బీఆర్ఎస్‌లోకి..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టమధు

కాటారం: బీజేపీ సీనియర్ నాయకుడు, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సోమవారం మంథనిలో తిరుపతితో పాటు పలువురు నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కొండ రాజమల్లు, జమీర్ ఖాన్, ముబీన్‌బేగ్, సమీర్‌షేక్, తాజోద్దీన్, మహబూబ్, సద్దాం, సుల్తాన్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, నాయకులు జక్కు శ్రావణ్, నరివెద్ది శ్రీనివాస్, భూపెల్లి రాజు, ఉప్పు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో పలువురు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

కాటారం: కాటారం మండలం రేగులగూడెం సర్పంచ్ దోమ రాహుల్‌రెడ్డి సోమవారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాజీనామా

ములుగు రూరల్: ములుగు మండలంలోని పత్తిపల్లి, పొట్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ధరమ్‌సోత్ శ్రీనివాస్, ఓదెల శ్రీకాంత్ పార్టీ పదవులకు, సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నామని సోమవారం తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబులకు సామాజిక మాధ్యమాల ద్వారా రాజీనామాను పంపించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులు పట్టించుకోకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నల్లగుంట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించి అధికారంలోకి రానుందన్నారు. నల్లగుంట మాజీ ఎంపీటీసీ చర్లపల్లి సునీత దంపతులతో పాటు మరో 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల సుచరిత శ్రీధర్‌రెడ్డి, మూడు మండలాల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు, జిల్లా నాయకులు పోరిక హర్జినాయక్, గై అశోక్, బుర్ర సమ్మయ్య, కూరెళ్ల రామాచారి, మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, నాయకులు ఆకిరెడ్డి రాంమోహన్ రావు, చంటి భద్రయ్య, సాద యాదగిరి, జనగాం రవీందర్, రామిండ్ల రాజేందర్, పెరుక నర్సింగారావు తదితులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న నోడల్ ఆఫీసర్ కృష్ణ

చిట్యాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల నోడల్ ఆఫీసర్ జి.కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కళారంగంలో ఎదగాలని కోరారు. కళా ఉత్సవాలు విద్యార్థుల సంపూర్ణ వికాసానికి తోడ్పడుతాయని అన్నారు. శాస్త్రీయ గాత్ర సంగీతంలో టీఎస్ఆర్‌డబ్ల్యూ పాఠశాలకు చెందిన వర్షా, సాంప్రదాయ గాత్ర సంగీతంలో చిట్యాల ఉన్నత పాఠశాలకు చెందిన స్వరూప, శాస్త్రీయ నృత్యంలో జూకల్‌కు చెందిన దిపిక, జానపద నృత్యంలో నైన్‌పాకు చెందిన శృతి, దృశ్యకళ నుంచి జూకల్‌కు చెందిన హాసిని జిల్లాకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కాగా, జిల్లాకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు రఘుపతి, ప్రణీత, లింగయ్య ఉన్నారు.

# ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం, గణితం సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఎంఈఓ, డీఈఓకు సమాచారం అందించి ఉపాధ్యాయులను నియమించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమాదేవికి ఫోన్ ద్వారా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు రవీంద్రాచారి, రఘు, రమేష్ ఉన్నారు.

# పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ

శాయంపేట : రైతులు తమ పంటపొలాల్లో పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం (హెచ్అండ్ఎం ప్రాజెక్టు) అసోసియేట్ మేనేజర్ అక్కల రమేష్ సోమవారం వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు సమావేశం ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. మహిళలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, దీనికి ముఖ్య కారణం రైతులు పంటలకు వాడుతున్న రసాయనాలే అన్నారు. పొలాల్లో పురుగు మందులు పిచికారి చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. పురుగు మందులు పిచికారి చేసేముందు పీపీఈ కిట్లను ధరించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రజ్వల్ క్షేత్రసిబ్బంది, ఆశ కార్యకర్తలతోనే ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి, సిబ్బంది రాంబాబు, తిరుపతి, సునీల్, కల్పన, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

మహాముత్తారం: మండలంలోని డొబ్బలపాడులో గల మోడల్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం భారతీయ రిజర్వు బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ.. సైబర్‌క్రైం, బ్యాంకు సేవలు, ఇన్సూరెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాజాత బృందంచే పాటల రూపంలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం చిరంజీవి, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ బాలకృష్ణ, రాజేష్, స్కూల్ ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక రక్తపోటు బాధితులను గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుమలత

ఏటూరునాగారం: సర్వేలు చేపట్టి ముందస్తుగా అధిక రక్తపోటు బాధితులను గుర్తించి వారికి సూచనలు చేయాలని రొయ్యూర్ వైద్యాధికారిణి సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పల్లె దవాఖానలో నిర్వహించే ఆశ డే, అసంక్రమిత సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో బీపీ, షుగర్ ఉన్నవారికి మందులు ఇస్తూ కొత్తగా బీపీ, షుగర్ గ్రస్తులను గుర్తించాలన్నారు. అధిక రక్తపోటు ఉన్న వ్యక్తులను ఉప్పు, కారం తగ్గించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడే విధంగా చూడంతోపాటు వారిలో వచ్చే అనారోగ్య సమస్యలను కూడా ఆశవర్కర్లు గుర్తించాలన్నారు. జ్వరాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ సర్వే క్రమంలో వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా జ్వరపీడితులు, వ్యాధి గ్రస్తులకు మందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఛాముండేశ్వరి, డాక్టర్ సుచరిత, హెచ్ఈ స్వరూపరాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యం తాగి నడిపితే కఠిన చర్యలు



బ్రీత్‌అనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై సుధాకర్



కారును తనిఖీ చేస్తున్న వాజేడు పోలీసులు

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టేకుమట్ల శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం నేరం అన్నారు. వాహన ప్రమాదాల వల్ల శారీరక, ఆర్థిక నష్టాలు చూడాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత సూత్రాలను పాటించి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్ రెడ్డి, కానిస్టేబుల్‌లు మహేందర్, సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**వాహనాల తనిఖీ**

వాజేడు: మండల పరిధిలో కృష్ణాపురం, జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై రమేష్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసుల సోమవారం వాహన తనిఖీలను నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు.

# ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే, భూపాలపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి చిట్యాల మండలంలోని దూద్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా, ఒడితల, పాశిగడ్డ తండా, కొత్తపేట, గోపాలపూర్ గ్రామాల్లో, భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి ఎస్ఎం గ్రామంలో, మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో ప్రచారం నిర్వహించారు. రేగొండ మండలంలోని రంగయ్యపల్లి, కనిపర్తి, నాగుర్లపల్లి, రాయపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు మల్హర్ మండలంలోని మల్లారం గ్రామంలో ప్రచారం చేశారు. భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు మొగుళ్లపల్లి మండలంలోని వేములపల్లి, నర్సింగాపూర్, కాసులపాడు, గుండ్లకర్తి, బంగ్లాపల్లి, గుడిపాడు, ఎల్లారెడ్డిపల్లి, పిడిసిల్ల గ్రామాలల్లో ప్రజాదీవెన యాత్ర కొనసాగించారు. కాటారం మండలంలోని దామెరకుంటలో బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధు తరపున జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేష్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. చిట్యాల మండలంలోని దూత్‌పల్లి, లక్ష్మీపూర్ తండ, ఒడితల, పాశిగడ్డతండా, కొత్తపేట గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేపట్టారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీలో బీజేపీ అభ్యర్థి తరపున ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ప్రచారం చేశారు. -సాక్షి నెట్‌వర్క్

# బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న బాల్య మిత్రులు



ములుగు రూరల్: పరామర్శిస్తున్న సీతక్క

ములుగు రూరల్: ములుగు మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ల మోహన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సీతక్క సోమవారం పరామర్శించారు. మోహన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన మోకిడి విజయ్ కుమార్ తండ్రి రాజేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి చిన్ననాటి బాల్య మిత్రులు విజయకుమార్‌ను సోమవారం పరామర్శించారు. గద్దం తిరుమలేష్, రాములు, మధుసూదన్, రాజేందర్, రాజు, సంపత్, శ్రీధర్, బాలు, తదితరులు ఉన్నారు.

### గుడుంబా, మద్యం స్వాధీనం

చిట్యాల: మండలంలోని ముచినిపర్తి గ్రామ శివారులో ఎక్సైజ్ అధికారులు సోమవారం రూట్‌వాచ్ చేస్తుండగా 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే భూపాలపల్లి నుంచి మైలారం గ్రామానికి 48 బీర్లు అక్రమంగా ద్విచక్రవాహనంపై రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వాహనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులు పబ్బ సురేష్, పబ్బ ప్రశాంత్, చుక్క శివాజీలపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై మాన్‌సింగ్, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాంచంద్రునాయక్‌కే డోర్నకల్

కాంగ్రెస్ మూడో జాబితాలో అభ్యర్థిత్వం

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీలో ఉత్కంఠకు తెరపడింది. సోమవారం రాత్రి ఆ పార్టీ విడుదల చేసిన 16మంది జాబితాలో డోర్నకల్ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పేరు ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మొదటి రెండు జాబితాల్లో కాంగ్రెస్ డోర్నకల్ టికెట్‌ను ఖరారు చేయలేదు. దీంతో టికెట్ ఎవరికి వస్తుందోననే ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. మొదటి నుంచి డోర్నకల్‌లో రాంచంద్రునాయక్, నెహ్రూనాయక్ పేర్లు వినిపించగా.. మధ్యలో భూపాల్‌నాయక్ తెరపైకి వచ్చారు. కాగా మానుకోట టికెట్ ఆశించి భంగపడిన బలరాంనాయక్, బెల్లయ్యనాయక్ సైతం పోటీపడుతున్నారనే వార్తలు ఇటీవల వచ్చాయి. ఈ పరిస్థితుల్లో సోమవారం రాత్రి విడుదల చేసిన జాబితాలో రాంచంద్రునాయక్ పేరు ఫైనల్ కావడంతో ఉత్కంఠకు తెరపడింది.